# గృహిణి

సూర్యారావు అవాళ్టి డ్యూటీ సంతృప్తికరంగా చేసినందుకు తెగ సంతోషిస్తూ మూటాముల్లె సర్దుకుంటున్నాడు.

టాంక్‌బండ్ పిల్లల కేరింతలతో పెద్దల కబుర్లతో సరదాగా, సందడిగా వుంది.

బుజ్జినీ, నందూనీ తీసుకుని షికారుకొచ్చింది సుశీల. వాళ్ళని చెరోచేత్తో పట్టుకుని నడిపిస్తూ వాళ్ళు వేస్తున్న చిట్టి ప్రశ్నలకీ, వెలిబుచ్చుతోన్న చిన్ని సందేహాలకీ జవాబులిస్తోంది. ముచ్చటగా వున్న తన పిల్లల వంక మురిపెంగా చూస్తోన్న చూపుల్ని చిరు గర్వంతో స్వీకరిస్తూ నడుస్తోంది.

"మమ్మీ ఇక్కడ కూర్చుందాం" ఖాళీగా వున్న బెంచీ వంక చూపిస్తూ అన్నాడు నందూ.

"పదండి"

"పల్లీలు కొనవా మమ్మీ" బుజ్జి అడిగింది గారాలు పోతూ.

చెరో పొట్లం కొనిపెట్టింది. పల్లీలు నములుతూ ఉత్సాహంగా కబుర్లు చెబుతోంటే తన్మయంగా వింటోంది సుశీల.

"హాయ్ సుశీ......"

ఉలిక్కిపడి తలెత్తింది.

ఆకాశనీలపు జార్జెట్‌చీర, చేతుల్లేని బ్లౌజ్, మెడలో ఒంటిపేట గొలుసు, కళ్ళకి నల్ల కళ్ళద్దాలు, క్లిప్పులోంచి ఫ్రీగా వదిలిన జుట్టు, హైహీల్స్, పసుపు పచ్చని హేండ్ బాగ్, ఒంటినుంచి వస్తోన్న ఒక రకమైన సుగంధం-స్లిమ్‌గా అందంగా లవ్లీగా వున్న ఎవరో పాతికేళ్ళ - ఛా ఛా ఇరవై ఏళ్ళ సుందరి.

"ఏవిటే క్వశ్చన్ మార్క్ ముఖమూ నువ్వూనూ!" అందామె నవ్వుతూ కళ్ళజోడు తీస్తూ.

"నువ్వటే రమా. నేను గుర్తు పట్టలేకపోయాను సుమా" బోలుడు సంబర పడిపోతూ అంది సుశీల.

"ఇప్పటికైనా గుర్తు పట్టినందుకు చాలా సంతోషంగానీ మీరు ఈ ఊళ్ళోనే వుంటున్నారా? మీ ఆయనెందులో చేస్తున్నారు? వీళ్ళు మీ కోతులా?"

నవ్వుతూ తలాడిస్తూ "పెళ్ళయినా నీ వాగుడు కొంచెం కూడా తగ్గలేదు. అన్నట్టు మీ ఆయనెందులో పన్జేస్తున్నారే?" అనడిగింది.

"ఆయన ఇ సి ఐ యల్‌లో చేస్తున్నారు. నేను బ్యాంకులో చేస్తున్నాను. వాటెబవుట్ యూ. నువ్వేం చేస్తున్నావే"

"వీళ్ళ నాన్నగారు ఏజీ ఆఫీసులో ఆడిటర్‌గా చేస్తున్నారు. నేనేమో ఐ.సి.యస్ చేస్తున్నాను"

"వ్వా.....ట్....."

"అవునే, ఇండియన్ కుకింగ్ సర్వీస్" నవ్విందామె

"యూ మీన్ హౌస్ వైఫ్? చంపేవ్ ఫో. అయితే వంటలక్క ఉద్యోగం చేస్తున్నావన్న మాట. కాలేజీ చదువు వెలగబెట్టిన నీలాటివాళ్ళు కూడా జాబ్స్ చెయ్యకపోతే ఇక మనం ముందడుగేసేదెప్పుడు ?

"ఉద్యోగం చేస్తేనే ముందడుగేసినట్టా?"

"నీ తర్కానికో నమస్కారం"

"పోన్లేగాని నీ గురించి చెప్పవే"

"చూస్తున్నావుగా. కాలేజ్ డేస్‌లో చెప్పినట్టుగానే హాయిగా జాబ్ చేస్తున్నాను. ఫ్రీగా ఖర్చు పెడుతున్నాను. చదువుకి సార్ధకతా వుంది. తృప్తికి తృప్తీ వుంది. ఇంతకంటే ఏం కావాలి చెప్పు?"

సుశీల మొఖం కొంచెంగా నల్లబడింది. "అంతేలే. పిల్లలెందరే?"

"ఇద్దరు. అంతకంటే అనవసరమని ఆపరేషన్ చేయించేసుకున్నా. నీతో చాలా మాట్లాడాలిగానీ ఓసారింటికి రావే, మీ ఆయన్ని కూడా తీసుకురా, ఇదిగో మా ఇంటి అడ్రస్" అంటూ ఓ కాగితం మీద రాసిచ్చి "వస్తానే. ఆ వచ్చేది మా బస్సే అనుకుంటా" అంటూ వడివడిగా అడుగులేసింది రమ బస్టేజివైపు.

వెళ్తోన్న రమని చూస్తోందల్లా అప్రయత్నంగా తన వంక చూసుకుంది సుశీల.

ఖరీదు ఎక్కువే కావచ్చుగాక కాని ఆమె జార్జెట్ చీర తళుకు బెళుకుల ముందు తన పోలిస్టర్ చీర చిన్నబోతోంది. ఆమె స్లిమ్‌గా సెలయేర్లా వుంటే తను పెద్ద ముత్తైదువలా

ఇదిగో ఈ హుస్సేన్‌సాగర్లా వుంది. ఆమె తనకన్నా ఆర్నెల్లు పెద్ద. కానామె అసలు వయస్సుకి అయిదేళ్ళు తక్కువదాన్లా కన్పిస్తోంటే తను ఎక్కువదాన్లా కన్పిస్తోంది!

ఉస్సురంటూ నిట్టూర్చింది.

"ఆమె ఎవరు మమ్మీ" నందూ అడిగాడు.

"నా ఫ్రెండ్" అన్యమనస్కంగానే జవాబిచ్చింది.

"ఆంటీ అన్నమాట. మరి మాకు పరిచయం చెయ్యలేదేం మమ్మీ?"

ఏడేళ్ళ కొడుకు వంక సాలోచనగా చూస్తూండిపోయింది తప్ప జవాబివ్వలేకపోయింది. నందూ రెట్టించడంతో "ఇక వెళ్ళిపోదాం" అంటూ లేచింది.

"అప్పుడే వద్దు మమ్మీ"

బుజ్జి మాటలు పట్టించుకోకుండా ముందుకు నడిచింది సుశీల. బిక్కమొహాలేసుకుని అనుసరించారు పిల్లలిద్దరూ.

ఇంటికెళ్ళేక "బయటికెళ్ళి ఆడుకోండి" అంది మంచంమీద నడుం వాలుస్తూ.

పిల్లలు బయటికి పరుగెత్తారు.

చదివే రోజుల్లో చెప్పినట్లుగానే కలలు కన్నట్టుగానే రమ ఉద్యోగం చేస్తోందన్న మాట. మగవాడితో సమానంగా సంపాదిస్తూ ఖర్చుచేస్తూ ప్రత్యేక వ్యక్తిత్వంతో సుఖసంతోషాల్తో తులతూగుతోందన్నమాట. ఎంత అదృష్టవంతురాలు. అసలది ఇద్దరు బిడ్డలతల్లిలానే లేదు. టీనేజ్‌గర్ల్‌లా చూడముచ్చటగా వుంది. ముగ్ధమోహనంగా వుంది. ఏ రకమైన లోటూ లేకుండా ఆధునిక మహిళకి ప్రత్యక్ష నిదర్శనంలా ఉంది.

హుఁ తనూ వుంది ఎందుకూ?!

సంసారపు ఊబిలో మొలబంటి లోతు వరకూ దిగబడి గానుగెద్దులా తిరుగుతోంది. ఆవున్నిజంగా గానుగెద్దే.

పనిమనిషి కేకకి లేవడం, అంట్లువెయ్యడం, పాలసీసాలు తేవడం, పిల్లల్ని లేపి ముఖాలు కడిగించడం, టిఫిన్లు చెయ్యడం, పెట్టడం, వాళ్ళ కవీ ఇవీ అందించడం పుస్తకాలు సర్దివ్వడం, ఆయనకి మేలు కొలుపు పాడటం, కాఫీలివ్వడం, గడ్డం గీసుకోడానికన్నీ అమర్చడం, కూరలు తరగటం, హైరానపడుతూ వంట చెయ్యడం, కేరియర్లు సర్దటం, స్నానాలు చేయించడం, డ్రెస్ తొడిగి స్కూల్‌కి పంపించడం, ఆయన స్నానానికి నీళ్ళు తోడటం, భోజనం వడ్డించడం, బట్టలందివ్వడం, పెన్ను దగ్గర్నుంచి అన్నీ అందిచ్చి

ఆఫీసుకి సాగనంపడం, ఏదో ఇంత తిని ఇల్లు సర్దడం, బట్టలు ఉతకడం, కర్టెన్లూ వగైరాలు మార్చడం సర్దటం. బజారు పని చూట్టం, సాయంత్రం పిల్లలొచ్చే వేళకి టిఫిన్లు చెయ్యడం, మళ్ళీ వంట ప్రయత్నం....బోర్ బోర్!

రమ అన్నట్టు తను కేవలం వంటలక్క, పనిమనిషి అంతే. ఇలా వంటకీ ఇంటికీ అంకితమైపోయి భర్తకీ పిల్లలకీ ఆ తర్వాత మనవలకీ సేవ చేస్తూనే రాలిపోవాలి!

ఇదేనా తన జీవితం? ఇంతేనా తను కోరుకున్నది?

కాదు కాదు కాదు !

మరి ?

తనకి ప్రత్యేకత ఉండాలి. స్వేచ్ఛ ఉండాలి. సుఖం ఉండాలి. తనదంటూ ఓ ప్రత్యేక బతుకు ఉండాలి. ఇంకా.....

"సుశీ" ఆఫీసునుంచి అప్పుడే వచ్చిన మధుమూర్తి పిలిచాడు బూట్లు విప్పుకుంటూ.

ఆమె పలుకలేదు.

"పడుకున్నావేం సుశీ? ఒంట్లో బావోలేదా?"

"బాగానే వుంది"

"మరీవేళప్పుడు పడుకున్నావేమోయ్"

"నందూ బుజ్జీ ఏరి?"

"అలా వీధిలో కెళ్ళారు. ఫ్లాస్కులో టీ ఉంది త్రాగండి"

కించిత్తు విస్మయంగా చూశాడు భార్య వంక.

తను ఆఫీసు నుంచి వచ్చే వేళకి శుభ్రంగా తయారై ఎదురొచ్చి చిరునవ్వుతో అలసట పోగొట్టి ఆప్యాయంగా టిఫినూ టీ ఇచ్చి సేద తీర్చే సుశీల ఇవాళ.....!

మంచం దగ్గరికెళ్ళి అంచుమీద కూర్చుని నుదుట చెయ్యి వేసి చూస్తూ "వంట్లో ఎలా వుంది సుశీ" అన్నాడు.

"బాగానే వుందన్నానుగా"

"మరి.....?"

"ఏవీ లేదు గాని మీరెళ్ళి టీ త్రాగండి విసిగించక"

ఎన్నడూ లేనిదామె కంఠంలో విసుగూ, నిర్లక్ష్యం ధ్వనించేసరికి మ్రాన్పడి కొత్త వ్యక్తిని చూసినట్టు చూశాడు. తర్వాత మెల్లగా బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

బట్టలన్నీ పాడుచేసుకుని ఆటల్నుంచి వచ్చిన పిల్లల్ని చూసి కయ్‌మని పడింది.

విసురుగా బట్టలు ఊడబీకి రుసరుసలాడుతూ స్నానాలు చేయించింది. చాకింటి బట్టలు తీసిమ్మని భర్తకి పురమాయించి ఉడికీ ఉడకని అన్నం రుచీపచీ లేని కూరా వండి వడ్డించింది. అర్థాకళ్ళతో పిల్లలు కంచాల ముందు నుంచి లేచిన సంగతామె గుర్తించనేలేదు

రెండు ముద్దలు నోట్లో వేసుకుని లేవబోతోంటే "అదేవిటి సుశీ" అన్నాడు మధుమూర్తి ఆశ్చర్యంగా.

"ఆకలిగా లేదండీ"

ఆమెనేదో అడగాలనుకున్నాడు గానప్పటికే ఆమె గదిలోకెళ్ళి పోవడంతో మౌనంగా ఊరుకుండి పోయాడు.

రోజూలా తల్లి తమ దగ్గర కూర్చుని చదువుకోమని చెప్పకుండా వెళ్ళి పడుకునేసరికి ఓ అరగంట పుస్తకాలు తిరిగేసి వెళ్ళి పడుకున్నారు పిల్లలు.

అందర్నీ కరుణించిన నిద్రాదేవి సుశీల వంక కన్నెత్తైనా చూడకపోయేసరికి అసహనంగా దొర్లసాగిందామె. అసంతృప్తితో ఆమె మనసు వేగిపోతోంటే ఎప్పటికో మాగన్నుగా నిద్రపట్టింది.

రమ తెలుగు వార్తలయ్యాక బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచి బాత్‌రూమ్‌లో కెళ్ళింది.

ముఖం తుడుచుకుంటూ వచ్చేసరికి అత్తగారు ఆమెకీ కొడుక్కీ కాఫీలందిచ్చింది.

పేపరు చదువుతోన్న భర్తతో కబుర్లు చెబుతూ కాఫీ త్రాగటం పూర్తిచేసేసరికి పనిపిల్ల పిల్లలకి నీళ్ళుపోసి బట్టలు తొడిగి పుస్తకాలు, బాక్సులు సిద్ధం చేసింది.

అత్తగారు టిఫిన్ బాక్సులందివ్వగానే "గుడ్ బై మమ్మీ గుడ్ బై డాడీ" అంటూ పిల్లలు బూట్ల శబ్దాలు చేసుకుంటూ వెళ్ళిపోయారు.

కూనిరాగాలు తీస్తూ స్నానం చేసి వచ్చి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుంది రమ. తల దువ్వుకుని బట్టలు మార్చుకొనేసరికి "అమ్మాయ్-అన్నం వడ్డించానే" అంటూ కేక పెట్టింది అత్తగారు.

భర్తతో బాటు భోంచేసి వచ్చి ముస్తాబై హేండ్ బేగ్ తగిలించుకుని కళ్ళజోడు పెట్టుకుని జోళ్ళు తొడుక్కునేసరికామె భర్త స్కూటర్ స్టార్ట్ చేశాడు.

ఆమెని బ్యాంకు దగ్గర డ్రాప్‌చేసి తనాఫీసుకెళ్ళి పోయాడు.

ఆఫీసులో కబుర్లతో ఎక్కువ కాలం గడిపేసి టైమ్ పూర్తిగా అవ్వకుండానే

బయటికొచ్చేసింది.

తిన్నగా ఇంటికెళ్ళి ముఖం కడుక్కుని టీ త్రాగుతోంటే ఆమె భర్త వచ్చాడు. కొంచెం సేపు టీవీ ప్రోగ్రాం చూసి పిల్లల్ని అత్తగారికీ, పనిపిల్లకీ అప్పజెప్పి స్కూటర్‌మీద రయ్‌మంటూ షికారుకెళ్ళారు.

అకస్మాత్తుగా మెలకువ వచ్చి చుట్టూ చూసింది సుశీల.

'ఇదంతా కలేనా !' అనుకుందాశ్చర్యంగా. అంతలోనే 'కల కాదంతా నిజవేలే' అని చెప్పుకుని దీర్ఘంగా నిశ్వసించింది.

"నిద్రపోలేదా సుశీ?" ఆమె నిట్టూర్పు విన్న మధుమూర్తి అడిగాడు.

"వుహూ...."

"ఏం ఎలా వుందసలు ఒంట్లో ? సాయంత్రం నుంచి అదోలా ఉన్నావు"

"ఏం లేదు కానండీ ఒక మాటడగనా?"

"అడుగూ"

"నేను....నేను ఉద్యోగం చేస్తానండీ"

విస్తుబోయాడతను. ఆమె వంక అర్థంకానట్టు చూస్తూ అన్నాడోక్షణానంతరం "ఇప్పుడెందుకొచ్చిందా ఆలోచన? నువ్వు ఉద్యోగం చేసి సంపాదించాల్సినంత ఆర్థిక ఇబ్బందు ల్లేవే మనకి....."

"అది కాదండీ. మరి......"

"మరి?"

"నాకు.....నాకు.....నా వ్యక్తిత్వం నిలుపుకోవాలనీ......"

"ఇప్పుడు నీ వ్యక్తిత్వానికేం ముప్పు వచ్చిందోయ్" నవ్వేడతను

"అది కాదండీ మరేమో స్వేచ్ఛ కావాలనీ....."

"అంటే?"

"అదే సంపాదించే స్వేచ్ఛ. ఖర్చు పెట్టే స్వేచ్ఛ"

"మనిద్దరం వేరు వేరనుకుంటే చెప్పలేనుగాని ఒక్కటే అనుకున్నప్పుడు ఎవరు సంపాదించినా ఇద్దరూ సంపాదించినట్టే. ఇక జీతమంతా నీ చేతిలోనే పోస్తున్నాను. నీ ఇష్టప్రకారమే ఖర్చు పెడుతున్నావు కదా?"

"అవుననుకోండీ ఇద్దరం ఉద్యోగాలు చేస్తే టీవీ కొనుక్కోవచ్చు. స్కూటర్ కొను క్కోవచ్చు. ఇంకా చాలా చాలా కొనుక్కోవచ్చు. చాలా సుఖపడొచ్చు పైగా డిగ్రీ చదివినందుకు

వంటింటి కుందేల్లా పడివుంటే ఏం లాభమండీ ఏదో ఉద్యోగం చేస్తేనే సార్థకం గానీ. ఏమైనా సరే మీరొప్పుకోవాలి"

"సుఖం అనేది తృప్తిలో ఉంటుంది. తృప్తి డబ్బులోనూ విలాసాల్లోనూ ఉండదు. సరే నీ మాటెందుక్కాదనాలీ అలాగే చెయ్యి"

"హమ్మయ్య. మీరింత తేలిగ్గా ఒప్పుకుంటారనుకోలేదు సుమండీ"

సంబరంగా అన్న ఆమె వంక క్రొత్త వ్యక్తిని చూసినట్టు చూశాడు.

ఆ మర్నాటినుంచే 'వాంటెట్ కాలమ్స్' వెదకసాగింది సుశీల.

పెట్టె అడుగున దాచేసిన సర్టిఫికెట్లు బయటికి తీసి దుమ్ము దులిపింది. ట్రూ కాపీలు తీయించి మంచి ఉద్యోగ మనిపించిన ప్రతి దానికీ ఒక్కో దరఖాస్తుబాణం వదలసాగింది.

ఉద్యోగాన్వేషణపు యావలో పడిపోయిన ఆమెకి సంసారపు బాధ్యతలు పెద్ద గుదిబండలా కన్పించసాగాయి. ఇది వరకట్లా ఏదీ శ్రద్ధగా చెయ్యటం లేదు. ప్రతి దానికీ విసుక్కోవడం ఎక్కువయ్యింది.

ఆమె ఎందుకలా మారిందో ఎంతాలోచించినా అర్థం కాకపోయేసరికి పిల్లల సంరక్షణ అదీ తనే చూడసాగాడు మధుమూర్తి.

రమ సాయాన్నర్థిస్తే ఫలితం వుండకపోదన్పించడంతో ప్రక్కింటినుంచి ఆమె పనిచేస్తోన్న బ్యాంకుకి ఫోన్ చేసింది సుశీల.

పిచ్చాపాటీ అయ్యాక "మీ బ్యాంకులో ఖాళీలేమైనా వున్నాయిటే?" అనడిగింది సంకోచిస్తూనే.

"ఎందుకే?"

"నాకేమైనా ఇప్పించగలవేమోనని"

"నీకా?" ఆమె గొంతునిండా ఆశ్చర్యం.

"ఆశ్చర్యంగా వుందా?"

"అబ్బే అది కాదు...."

"నేనడిగింది చెప్పలేదు"

"మాది చిన్న ప్రైవేటు బ్యాంకని నీకు తెలుసుగా. ఇప్పుడిప్పుడే మన రాష్ట్రంలో చాలా బ్రాంచీలు పెడుతున్నారు. అంచేత ఖాళీలెక్కువే వుంటాయనుకో. కానీ......

"కానీ? సంకోచించక ఏవిటో చెప్పవే రమా"

"డబ్బు తీసుకుని జాబ్ ఇస్తున్నారనీ......ఓ బ్రోకర్ ద్వారా ఈ పని జరుగుతోందనీ విన్నాను మరి"

"ప్లీజ్ రమా, వివరాలు కనుక్కో ప్రయత్నిద్దాం."

"సరే అయితే రేప్రొద్దుటే మా ఇంటికిరా. అద్నించటు వెళ్దాం. ఎడ్రస్ ఉందిగా?"

"ఉంది థాంక్యూ"

గాలిలో తేలిపోతూ ఇంటికొచ్చింది. మధుమూర్తి ఎప్పుడొస్తాడా అని చూసి చూసి రాగానే శుభవార్త అతడి చెవిలో వేసి అప్పుడే ఉద్యోగం వచ్చేసినట్టు మురిసిపోయింది.

మర్నాడు పొద్దుటే లేచి స్నానాదులు చేయించి భర్తని లేపింది.

మూలుగుతూ లేచాడు మధుమూర్తి.

"ఏమిటలా వున్నారు?"

"దగ్గూ రొంపా" అన్నాడు ఖళ్ళు ఖళ్ళుమని దగ్గుతూ.

"బాగా వేడిచేసినట్టుంది. ఇంట్లో బార్లీ ఉన్నాయ్ కాసిని బార్లీ నీళ్ళు కాచుకుని తాగితే తగ్గిపోతుంది. నేను రమ దగ్గరి కెళ్తున్నాను" అంటూ పనులన్నీ అప్పగించి ఆటోలో రమా వాళ్ళింటికెళ్ళింది సుశీల.

ఆమె వెళ్ళేసరికి రమా వాళ్ళిల్లు ప్రశాంతంగా వుంది. ఇంకా లేవ లేదేమోననుకుంటూ సందేహిస్తూనే తలుపు తట్టింది.

కొంచెం సేపటికి తలుపుతీసిన రమని చూసి బ్రాన్పడిపోయింది సుశీల.

ఆమె ఆ మధ్య కన్పించినట్టు అందాల అప్సరంజిబొమ్మలా లేదు. మసిమరకల వాయిల్ చీరతో చిందరవందరగా వున్న జుట్టుతో జిడ్డోడుతోన్న ముఖంతో ఏదోలా వుంది.

"అక్కడే నిలబడిపోయావేం రావే"

లోపలికి నడిచింది ఆశ్చర్యాన్ని దాచుకుంటూ.

లోపలి దృశ్యాలు మరీ ఇదిగా ఉన్నాయి బట్టలూ సామాన్లూ చిందర వందరగా పడి వున్నాయి.... పైకప్పు నుంచి బూజులు వేళ్ళాడుతున్నాయి. కర్టెన్లు మాసి మరకల్తో అసహ్యంగా వున్నాయి. దండెం మీద బట్టలు గుట్టలుగా పడివున్నాయి.

ఇబ్బందిగా కదిలింది సుశీల.

అదేమీ పట్టించుకోని రమ "వంటింట్లో కూర్చుందాం రావే" అంటూ దారి తీసింది.

వాళ్ళని చూసి రెండు ఎలుకలు ఓ డజను బొద్దింకలూ పరుగులు తీశాయ్. వంటింట్లో అదోరకం గబ్బు వాసన.

"పని మనిషి లేదేవిటే"

"ఎందుకు లేదూ అంట్లు తోమడానికి ఇరవయి రూపాయలు పెట్టి పెట్టుకున్నాం. దానికి వారానికి ఆ(్రోజులు రోగమే వస్తుంది. ఈ వెధవ సిటీలో ఇంతకంటే మంచి పనిమనిషి దొరకదాయె. త్వరగా వంటా పెంటా పూర్తి చేసి తెమలకపోతే అవతల ఆఫీసందుకోలేం. ఈ ఉరుకులూ పరుగుల్తో ఛస్తున్నాననుకో"

"పిల్లలేరే ?"

"హాస్టల్లో చేర్చాం"

"ఈ వూళ్ళోనే"

"వూC"

"అదేవిటే మనం చూసినంత శ్రద్ధగా వాళ్ళు చూస్తారేవిటీ"

"చూస్తే చూస్తారు మానే మానారుగానీ వాళ్ళ పనికూడా చూడాలంటే నా తరం కాదు తల్లీ. ఇంటిపనీ పిల్లలపనీ శ్రీవారిపనీ ఆఫీసు పనీ అన్నీ చూడాలంటే నాపని గోవిందే"

"బావగారు సాయంరారా?"

"సరిసరి. ఆయన నిద్ర లేచేసరికి తొమ్మిదవ్వుద్ది"

"ఏం? రోజూ సినిమాలకెళ్తారా?"

వెర్రి బాగుల్దాన్ని చూసినట్టుచూసి, "క్లబ్బు కెళ్ళి అట్నించి ఏ బార్‌కో వెళ్ళి ఎప్పటికో వస్తారు" అంది.

"అయితే ఆయన జీతం ఆయన ఖర్చుకే సరిపోతుందన్నమాట"

"సరిపోతే బాగానేవుండ్ను అంతా లోటు బడ్జెట్టే"

"మరెందుకా పాడు అలవాట్లు ? నువ్వు చెప్పి మార్చొచ్చుగా"

"వంటింటి కుందేలువి నీకేం తెలుస్తాయిలే ఆ అలవాట్లూ ఆ సరదాలూ. ఆ సర్కిల్‌ని హై సొసైటీ అంటారు"

రోషం వచ్చింది సుశీలకి 'అసల్నీకు ఇంటినెలా ఉంచాలో పిల్లల్నెలా పెంచాలో భర్తతో ఎలా వుండాలో తెలుసా' అని జాడిద్దామనుకునే నిగ్రహించుకుంది.

"అన్నట్టు అసలు సంగతి చెప్పడం మర్చిపోయాను. ఆ బ్రోకర్ ఏదో ఊరెళ్ళాట్ట. నాల్రోజులగ్గాని రాడట. వచ్చేవారం వెళ్దామే"

డీలాపడిపోయిందా మాటలకి సుశీల.

"సర్లే నే వస్తానే"

సిటీ బస్సుకోసం చూడకుండా ఆటోమీద ఇంటికొచ్చేసింది సుశీల.

ఆమె వచ్చేసరికి ఓ ప్రక్కన ఖంగు ఖంగుమని దగ్గుతూనే ఉప్మాచేస్తున్నాడు మధుమూర్తి. అది మాడి వాసనొస్తుంటే, కంగారుగా దింపబోయి చేతులు కాల్చుకుని చిందులెయ్య సాడతను.

బాత్‌రూమ్‌లోంచి నీళ్ళంటూ బుజ్జి కేకలు పెడుతోంది. 'నా పెన్ను కనిపించడం లేదు డాడీ' అంటూ నందూ అలమార్లోని పుస్తకాలన్నీ క్రిందపారేసి వెతుక్కుంటున్నాడు.

"ఇంకేం అంట్లు లేవుకదా అయ్యగారూ?" అంటూ వెళ్ళిపోజూస్తోంది పనిమనిషి!

సుశీల కళ్ళల్లో నీళ్ళొచ్చాయ్.

తనున్నప్పటికీ లేనప్పటికీ ఇంత తేడా వుందీ అంటే తనకీ ఇంట్లో వ్యక్తిత్వం లేదని ఎవరనగలరు తనపిచ్చి గాకపోతే? ఉద్యోగం చేస్తే పెద్ద కిరీటం పెట్టుకున్నట్టని ఊరేగటం తప్పిస్తే ఏవుంది గర్వకారణం? అసలు ఆడదానికి తనదీ అనే జీవితం పెళ్ళయ్యేవరకే. ఆ తర్వాత ఆమె జీవితం ఆమెదికాదు భర్తదీ బిడ్డలదీనూ. భర్త విజయాల వెనుక బిడ్డల ఉన్నతి వెనుక బాసటగా నిలిచిన మూర్తి స్త్రీయే. వారి గొప్పలూ ఘనతలూ అన్నీ ఆమెవే. అంతకంటే ఆమెకి సార్థకత ఏముంటుందసలు ?

వంటమనిషీ పనిమనిషీ అని తనను తాను కించ పరచుకొంటోందిగాని నిజానికి తనంతేనా? కాదు కాదు. తను టీచర్, నర్స్, బడ్జెట్ గైడర్, ఎడ్వైజర్, హౌస్ మేనేజర్, పర్సనల్ సెక్రటరీ, ఏక్కౌంటెంట్, పర్చేజింగ్ ఆఫీసర్! ఇవేగాక ఏకకాలంలో మరిన్ని వృత్తుల్ని ప్రతిభావంతంగా నిర్వర్తిస్తోన్న గృహిణి తను! తన చదువూ విజ్ఞానం వృథా అవుతున్నాయని ఎవరనగరు?

ఫైలు ఓ ప్రక్కకి విసిరేసి కళ్ళు తుడుచుకుని కొంగు బొడ్లోదోపుకుంటూ "వస్తు న్నానర్రా" అంది సుశీల.

**(ఆంధ్రభూమి వారపత్రిక 5.11.1981)**